

ఓటేసిన మేడ్చల్ కలెక్టర్

శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండలంలో ఆదివారం అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచి ప్రజలు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి తరలివెళ్లారు. తూంకుంట మున్సిపల్ పరిధి, అంతాయిపల్లిలోని 171వ పోలింగ్ కేంద్రంలో మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఓటు వేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్కా ప్రభాకర్‌గౌడ్ కుటుంబ సమేతంగా శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేటలో ఓటును వినియోగించుకున్నారు.



జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి



గౌడవెల్లిలో మాజీ మంత్రి ఉమావెంకట్రామ్‌రెడ్డి



అవుషాపూర్‌లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి



వికలాంగుడిని పోలింగ్ కేంద్రానికి తరలిస్తూ..



జవహర్‌నగర్‌లో పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న సీపీ డీఎస్.చౌహాన్



ఉద్దమర్రి పోలింగ్ కేంద్రంలో మహిళలు



శివారెడ్డిగూడలో ఓటేయడానికి బారులు తీరిన ఓటర్లు



ఎన్ఎఫ్‌సీనగర్‌లో నాయకుల సందడి



రాజబొల్లారం పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 5 గంటల వరకు క్యూలో ఓటర్లు



పూడూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న యువత

మందకొడిగా మొదలై.. తర్వాత పుంజుకొని..

- మేడ్చల్ జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్
- పోలింగ్ ముగిసిన కొన్ని కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- జిల్లాలో అత్యధికంగా మేడ్చల్‌లో.. అతి తక్కువగా కూకట్‌పల్లిలో..
- పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్
- ఓటింగ్‌ను పర్యవేక్షించిన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికలు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఒకటి, రెండు ప్రాంతాల్లో ఈవీఎంల మొరాయింపు మినహాయించి, జిల్లా అంతటా ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట బూత్ నంబర్ 174, ఉప్పల్ నియోజకవర్గంలోని బూత్ నంబర్ 349లో ఈవీఎంలు మొరాయించటంతో.. కొద్దిసేపు ఓటర్లు ఇబ్బంది పడ్డారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పొలింగ్ మధ్యాహ్నం 12 గంటల వరకు పుంజుకుంది. ఆ తర్వాత కొంత మందకొడిగా పోలింగ్ సరళి కనిపించినా.. సాయంత్రం వరకు జోరుగా సాగింది. మేడ్చల్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలతో సహా కొన్ని స్లమ్ ఏరియాల్లోని కేంద్రాల వద్ద పోలింగ్ ముగిసినప్పటికీ.. ఓటర్లు బారులు తీరి కనిపించారు.

పోలింగ్ సరళి ఇలా...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పోలింగ్ సరళి స్లోగా పుంజుకుంది. మేడ్చల్‌లో ఉదయం 9 గంటల వరకు 2.4 శాతం, 11గంటల వరకు 15.31 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటల వరకు 28.25 శాతం, 3 గంటల వరకు 42.17 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 54.62 శాతం పోలింగ్ నమోదైంది. మల్కాజిగిరిలో వరుసగా, 5.81 శాతం, 14.21 శాతం, 26.9 శాతం, 39.5 శాతం, 46.8 శాతంగా ఓట్లు పోలయ్యాయి. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజవర్గంలో వరుసగా 8.5 శాతం, 14.2 శాతం, 28.9 శాతం, 40.6 శాతం , 52.8 శాతం పోలింగ్ నమోదైంది. కూకట్‌పల్లిలో వరుసగా 5.32 శాతం, 14.9 శాతం, 22 శాతం, 32.74 శాతం, 42.6 శాతం ఓట్లు పోలయ్యాయి. అలాగే, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉదయం 9 గంటలకు ఐదు శాతం, 11 గంటలకు 15.1 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 26.1శాతం, 3గంటల వరకు 34.2 శాతం, సాయంత్రం 5గంటల వరకు 46.2 శాతం పోలింగ్ నమోదైంది.

ప్రధాన పార్టీల అభ్యర్థుల పర్యవేక్షణ

అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో ఓటింగ్ సరళితోపాటు తమకు అనుకూలంగా ఓట్లు పడుతున్న తీరును పర్యవేక్షించారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్, బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి, మల్కాజిగిరిలో మైనంపల్లి హన్మంతరావు (కాంగ్రెస్), మర్రి రాజశేఖర్‌రెడ్డి(బీఆర్ఎస్), ఎన్.రామచంద్రరావు(బీజేపీ) కుత్బుల్లాపూర్‌లో వివేకానంద(బీఆర్ఎస్), కూన శ్రీశైలంగౌడ్ (బీజేపీ), కొలన్ హన్మంతరెడ్డి (కాంగ్రెస్) ఓటింగ్ సరళిని పర్యవేక్షించి, తమ ఎన్నికల ఏజెంట్లతో పరిస్థితిని సమీక్షించారు. కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు(బీఆర్ఎస్), బండి రమేష్(కాంగ్రెస్), ఎం.ప్రేమ్‌కుమార్ (జనసేన), ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో బండారి లక్ష్మారెడ్డి (బీఆర్ఎస్), ఎం.పరమేశ్వర్‌రెడ్డి(కాంగ్రెస్), ఎన్ఎస్ఎస్ ప్రభాకర్ (బీజేపీ)లు పర్యవేక్షించారు.



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి..

సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మేడ్చల్ కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా మాక్‌పోల్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. పోలింగ్ పరిస్థితి, ఓటింగ్ సరళి, పోలీసు బందోబస్తు తదితర అంశాలను పర్యవేక్షించిన ఆయన రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు, సలహాలు కూడా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్, పూర్వాగార్గ్, అమన్ మిట్టల్ పాల్గొన్నారు. అలాగే, గురువారం ఉదయం శామీర్‌పేట్ మండలం తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 169 పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించి పోలింగ్ సరళి, ఓటర్ల స్పందనను పరిశీలించారు. అలాగే, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కల్పించిన వసతులపై ఆయన ఆరా తీయడంతో పాటు సంతృప్తి వ్యక్తం చేశారు.

అంతటా ప్రశాంతంగా..

మేడ్చల్/మేడ్చల్ రూరల్: మేడ్చల్ నియోజకవర్గంలో గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. మేడ్చల్ నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. పట్టణంలోని వివిధ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో అధికారులు ఏర్పాటు చేసి వెంటనే పోలింగ్ ప్రారంభమయ్యేలా చేశారు. మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు.

ఓటు వినియోగించుకున్న వీఐపీలు..

ఎన్నికల పోలింగ్ సందర్భంగా నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో వీఐపీలు ఓటును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ బోడుప్పల్‌లో, శామీర్‌పేట్ మండలంలోని బొమ్మరాశిపేట్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్‌గౌడ్, ఘట్‌కేసర్ మండలంలోని ప్రతాపసింగారం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఓటును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి ఉమావెంకట్రాంరెడ్డి గౌడవెల్లిలో ఓటును వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువత, వృద్ధులు, వికలాంగులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

వసతులు.. బందోబస్తు భేష్..

పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నిర్వహణ అధికారులు అన్ని వసతులు కల్పించడంతో ఓటర్లు వసతుల మధ్య ఓటును వినియోగించుకున్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్, వారిని ఇంటి నుంచి తీసుకువచ్చి తిరిగి వదలిపెట్టేందుకు వాహనాలను ఏర్పాటు చేయగా వృద్ధులు, వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి వెయ్యి మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో గతంలో కంటే పోలింగ్ కేంద్రాలు పెరగడంతో ఓటర్ల బారులు తీరకుండా 10 నిమిషాల్లో ఓటు వేసి తిరిగివెళ్లారు.

◆ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించడంతో ఎక్కడ అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పోలింగ్ పూర్తయ్యాయి. మేడ్చల్‌లోని పలు పోలింగ్ బూత్‌లను మేడ్చల్ డీసీపీ శబరీష్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఎన్నికల అబ్జర్వర్ పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాలలోకి సెల్‌ఫోన్ అనుమతి లేకపోవడంతో సెల్‌ఫోన్‌తో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన కొందరు ఓటర్లు కొంత మేర ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రం వద్ద బయట ఉన్న సిబ్బంది వద్దపెట్టి లోపలికి వెళ్లారు.



రావల్‌కోల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ కేంద్రాల విజిట్

ఎన్నికల పోలింగ్ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు, ప్రధాన నాయకులు పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను విజిట్ చేశారు. మల్లారెడ్డి బోడుప్పల్, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో, కీసర మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించగా కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్ జవహర్‌నగర్, బోడుప్పల్, మేడ్చల్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను విజిట్ చేసి స్థానికుల నాయకులతో చర్చించి పోలింగ్ సరళి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్, మంత్రి మల్లారెడ్డి సోదరుడు గోపాల్‌రెడ్డి, కుమారులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, బీజేపీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

ఆలింగనం చేసుకున్న ప్రత్యర్థులు



మేడ్చల్: మేడ్చల్ బరిలో హోరాహోరిగా తలపడ్డ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి ఆలింగనం చేసుకున్నారు. బోడుప్పల్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు ఇద్దరు అభ్యర్థులు అక్కడికి వచ్చి ఒకరికొకరు ఎదురుపడ్డారు. దీంతో మల్లారెడ్డి, వజ్రేష్‌యాదవ్ ఆలింగనం చేసుకుని గెలుపుపై ఇద్దరు నేతలు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇద్దరు విక్టరీ సింబల్ చూపించి అందరినీ ఉత్సాహపరిచారు.

ఓటు వినియోగించుకున్న వారికి కృతజ్ఞతలు



జవహర్‌నగర్‌లో మాట్లాడుతున్న తోటకూర వజ్రేష్‌యాదవ్

జవహర్‌నగర్: ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్‌లో ప్రజాస్వామ్యమే గెలుస్తుందన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను ఆకర్షించేందుకు మోడల్ పోలింగ్ బూత్



బోడుప్పల్: బోడుప్పల్‌లోని ప్రభుత్వ మండల ప్రజాపరిషత్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 435 పోలింగ్ బూత్‌లో ఓటర్లను ఆకర్షించేందుకు వినూత్న రీతిలో మోడల్ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఓటర్ల ఆకర్షించే విధంగా ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్‌లో రిలాక్స్ కోసం, ఓటింగ్ అనుభవాన్ని అందించడం కోసం రంగోలి, రంగు రంగుల బెలూన్లు, పువ్వులు మొదలైన వాటితో ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేశారు. పూలతొట్లు, కారిడార్లు, ఓటర్ అవగాహన, సందేశాల కట్ అవుట్లు, పోస్టర్లు అందంగా అలంకరించారు. వినూత్న సెల్ఫీ పాయింట్, మినరల్ వాటర్, నీడతో కూడిన వెయిటింగ్ రూంలు, కూర్చోడానికి కుర్చీలు, ప్రథమ చికిత్స పాయింట్, ప్రత్యేక మరుగుదొడ్లు, ర్యాంప్‌లు, వీల్ చైర్, ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రవేశ ద్వారం వద్ద యువతులు ఓటర్లకు గులాబీ పువ్వులను ఇచ్చి స్వాగతం పలికారు. సెల్ఫీ పాయింట్ ఓటర్లను ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో ఓటర్లంతా కమిషనర్ జి.వేణుగోపాల్ రెడ్డి, సిబ్బందిని ప్రశంసలతో ముంచెత్తారు. అనేక మంది ఓటర్ల సెల్ఫీలు దిగారు.

మేడ్చల్ నియోజకవర్గం

పోలింగ్ శాతం 62.09

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో 62.09 శాతం నమోదైంది. ఓటర్లు చురుగ్గా పాల్గొని ఓటును వినియోగించుకున్నారు. ఓటింగ్ అనంతరం ఈవీఎంలను భోగారంలోని కౌంటింగ్ కేంద్రానికి అధికారులు తరలించి భద్రపరిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు బారులు తీరి ఓట్లు వేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 60.58శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి 62.09 శాతం నమోదైంది.

నాగారం, దమ్మాయిగూడలో..

కీసర: మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా నాగారం మున్సిపాలిటీలో 52.8 శాతం, పోలింగ్ జరిగింది. నాగారం మున్సిపాలిటీలో మొత్తం 50,687 మంది ఓటర్లుండగా 26,7775 (52.8 శాతం) ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు. 13,709మంది పురుషులు, 13,066 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో 43,825మంది ఓటర్లుండగా 25,496 (58.18 శాతం) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

పోచారం మున్సిపాలిటీలో 60 శాతం..

పోచారం: మున్సిపాలిటీలో మొత్తం 29,406 మంది ఓటర్లు ఉంటే, వీరిలో 17,653 ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. దీంతో పోలింగ్ 60 శాతంగా నమోదైంది. మిగిలిన 40 శాతం ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనకపోవడానికి గల కారణాల గురించి రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆరా తీస్తున్నారు. మొత్తం మీద మున్సిపాలిటీలో పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులతో పాటు అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో 55.2 శాతం పోలింగ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 75 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జవహర్‌నగర్‌లో 76,685 ఓట్లకు 42,333 ఓట్లు పోలయ్యాయి. దీంతో 55.2 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పలు పోలింగ్ కేంద్రాలను రాచకొండ సీపీ డీఎస్.చౌహాన్ సందర్శించారు.

బోడుప్పల్‌లో 59.36 శాతం పోలింగ్

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో గురువారం జరిగిన ఎన్నికల్లో 59.36 శాతం పోలింగ్ అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. మొత్తం 93,293 ఓట్లు ఉండగా 54,782 మంది ఓటర్లు ఓటును వినియోగించుకున్నారు. దీంతో బోడుప్పల్‌లో 59.36 పోలింగ్ అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ దంపతులు, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్‌లు తొలుత బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఓటు హక్కును వినియోగించుకున్నారు.





ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలికి సాయం చేస్తున్న ఎస్ఐ



పూడూర్‌లో సిబ్బంది వద్ద సెల్‌ఫోన్లు పెట్టిన ఓటర్లు





ఓటు వేసిన వృద్ధులు



జవహర్‌నగర్‌లో



మేడ్చల్‌లో బారులు తీరిన ఓటర్లు



ఓటు వేసిన ఆనందంలో మొదటిసారి ఓటర్లు